క్లుప్తంగా

జీరో దందాను అరికట్టాలి

బూర్గంపాడు: కిరాణా వ్యాపారులు చేస్తున్న జీరో దందాను అధికారులు అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు పున్నంచంద్ డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో కిరాణా వ్యాపారులు ఇష్టారాజ్యంగా వినియోగదారులను ధరల విషయంలో దోచుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ధరల విషయంలో ఎవరైనా అడిగితే జీఎస్టీ పేరు చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా తూకం విషయంలో కూడా వ్యాపారులు అక్రమాలకు పాల్పడి వినియోగదారులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కిరాణా వ్యాపారుల జీరో దందాపై నిఘా పెట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటివైద్య శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్డులోని ఆల్ పెన్షనర్స్ డివిజన్ కార్యాలయంలో ఈ నెల 18న ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు బందు వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వరంగల్ శరత్ మాక్స్ విజన్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అపరేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, హెల్త్ కార్డు కలిగిన వారు పరీక్షలు చేయించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన సాయం నవీన్ కుమార్ మెమోరియల్ రెండు మండలాల స్థాయి వాలీబాల్ పోటీల విజేతలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు బహుమతులను అందించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆద్వర్యంలో రెండు మండలాలు చర్ల, దుమ్ముగూడెం పోటీలను నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన వాలీబాల్ పోటీలలో ఫైనల్ పోటీలో కొత్త మారేడుబాక జట్టు బండిరేవు జట్టుపై గెలుపొందింది. విజేతలకు ఎమ్మెల్యే తెల్లం మొదటి బహుమతిగా రూ.15116, ద్వితీయ బహుమతి రూ.7516లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామారాజు, గట్టుపల్లి పూర్ణ చందర్ రావు, సోయం బాలకృష్ణ, ముక్తి జనార్దన్, మల్లికార్జున్, గ్రామ మాజీ సర్పంచ్ తెల్లం కృష్ణవేణి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రిటైర్డు ఉద్యోగి, మాజి సర్పంచ్ గట్టుపల్లీ నాగేశ్వర్ రావు, బుటారి నాగమణి, సోయాం పెంటయ్య, మిచ్చ దుర్గారావు, తెల్లం దర్మయ్య, గట్టుపల్లి రాం ప్రసాద్, శేషగిరి, సోయం నరసింహారావు, భద్రం, సంతోష్, శివాజీ, దినేష్, శ్యామ్ సుందర్, కుంజా రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నేడు (శుక్రవారం) స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటిస్తారని గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం బాధ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా కావడిగుండ్ల గ్రామంలో వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తారు. ఆ తర్వాత అనంతారం గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి, కోయ రంగాపురం గ్రామంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసి, వేదాంతపురం, కేశప్పగూడెం, గుర్రాల చెరువు పంచాయతీల్లో నూతన పంచాయతీ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఆయా కార్యక్రమాలకు మండలంలోని పార్టీ నాయకులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు మండలానికి చెందిన కంకనాల రమేష్–లలిత దంపతులు, ఉదయ్‌కిరణ్‌లు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం అన్నదాత రమేష్ దంపతులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాత దంపతులను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు దోస పాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: హైదరాబాదులోని శ్రీచైతన్య డీమ్డ్ యూనివర్శిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న దుమ్ముగూడెం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కసుకు ప్రీతి భార్గవికి చదువు కోసం రేలా ఎన్జీవో వ్యవస్థాపక అధ్యక్షుడు కొండూరు రమేష్‌బాబు గురువారం రూ.40వేల ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రీతిభార్గవి చదువుకు ఫీజులు కట్టేందుకు ఆర్థిక ఇబ్బందులను తెలుసుకుని భద్రాచలం పిలిపించి సాయం అందజేశారు. భవిష్యత్‌లో కూడా ప్రభుత్వం తరుపున విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఆదుకుంటేనే మనుగడ

- లారీలపై తగ్గిన బొగ్గు రవాణా
- ఉపాధి లేక అమ్మేస్తున్న యజమానులు, రోడ్డునపడుతున్న డ్రైవర్లు
- లోడింగ్ పెంచి ఆదుకోవాలని వేడుకోలు


లోడింగ్ లేక మణుగూరు యార్డులో నిలిచిన లారీలు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా నుంచి లారీల ద్వారా బొగ్గు రవాణా పూర్తిగా తగ్గిపోవడంతో వాటిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్న వారి జీవితాలు దుర్భర పరిస్థితికి చేరుకుంటున్నాయి. రోజుల తరబడి లోడింగ్ లేక లారీలు కదలకపోవడంతో లక్షలకు లక్షలు కిస్తీలు, ఇన్సూరెన్స్‌లు కట్టలేక కుటుంబ పోషణ సాగక లారీల యజమానులు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సింగరేణి యాజమాన్యం వ్యాగన్ల ద్వారా బొగ్గును తరలిస్తూనే రోజుకు సగటున 2–3వేల టన్నుల బొగ్గును లారీల ద్వారా వివిధ కంపెనీలకు అవకాశం కల్పించేది. ఫలితంగా లారీల యజమానులు, డ్రైవర్లు పరోక్షంగా ఆధారపడిన కుటుంబాల జీవనయానం సాఫీగా సాగేది. గత కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బొగ్గును విద్యుత్ కేంద్రాలకు పంపడంతో పాటు రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణాకు ప్రాముఖ్యతను సింగరేణి తగ్గించడంతో లోడింగ్ లేక కిస్తీలు కట్టేందుకు అప్పులపాలవుతూ యజమానులు లారీలను అమ్మేసుకుంటున్నారు. డ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా, రోజు కూలీలుగా మారుతున్నారు.

లారీలతో రవాణా ఎందుకు తగ్గింది?

ఏరియాలో బొగ్గు గనుల నుంచి 2003లో ఏర్పాటైన లారీ యూనియన్‌లో మొత్తం 600 పైచిలుకు లారీలు ఉండగా.. దేశంలో అన్ని ప్రాంతాలకు సిమెంట్ ఫ్యాక్టరీలకు, విద్యుత్ ప్రాజెక్టులు, చిన్న మధ్యతరహా పరిశ్రమలకు సింగరేణి బొగ్గు రవాణాలో లారీలు ప్రధాన పాత్ర పోషించేవి. ఈ క్రమంలో కేంద్రం ఆదేశాల మేరకు స్థానిక భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) టిప్పర్ల ద్వారా, హెవీవాటర్ ప్లాంట్‌కు రోప్‌వే ద్వారా ఇతర విద్యుత్ కేంద్రాలకు వ్యాగన్ల ద్వారా సింగరేణి బొగ్గును తరలిస్తున్నారు. ఇలా విద్యుత్ కేంద్రాలకే ఎక్కువ బొగ్గు తరలించడం, అందుకుగాను రోప్‌వే, వ్యాగన్లు వంటి సాధనాలను ఎక్కువగా వినియోగించడంతో లారీల ద్వారా బొగ్గు రవాణా పూర్తిస్థాయిలో నిలిచిపోయింది. దీంతో ఎప్పుడూ ఎదుర్కొని గడ్డు పరిస్థితిని లారీల యజమానులు రెండు సంవత్సరాలుగా ఎదుర్కొంటూ కేవలం 300 మంది మాత్రమే లారీ యజమానులు మిగిలారు. దీంతో లారీలు లోడింగ్ లేక యార్డులకే పరిమితం అవున్నాయి.

ప్రస్తుతం రోజుకు 200–300 టన్నులే...

గతంలో 2వేల నుంచి 3వేల టన్నులు రోజుకు టన్నేజీ తరలింపుకు అనుమతి ఇచ్చిన సింగరేణి ప్రస్తుతం 200–300 మాత్రమే ఇస్తుండటంతో లారీలు నడవక, కుటుంబ పోషణ సాగక లారీ యజమానులు దినసరి కూలీలుగా మారుతున్నారు. రోడ్డున పడుతున్న లారీ యజమానుల కుటుంబాలను, ఉపాధి కూలీలుగా మారుతున్న తీరును సింగరేణి డైరెక్టర్, సీఅండ్ఎండీ దృష్టికి స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ నేత అయోధ్యచారి, పలు పార్టీల నాయకులు తీసుకెళ్లగా రోజుకు కనీసం 500–1000 టన్నులు రవాణా ఇస్తామని హామీనిచ్చారు. అది పూర్తి స్థాయి కార్యరూపం దాల్చకపోవడంతో పరిస్థితిలో మార్పు రాకపోగా.. కుటుంబ పోషణ, కిస్తీలు, డ్రైవర్లు, క్లీనర్లు, ఇలా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన సుమారు ఆరువేల కుటుంబాలు రోడ్డున పడుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణాను పెంచి ఆధారపడ్డ కుటుంబాలను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఆర్డర్లు లేకనే..



రోడ్డు రవాణాకు కావాల్సినంత బొగ్గు అందుబాటులో ఉంది. సేల్ ఆర్డర్లలో కోరే బొగ్గు రావడానికి మరో 15 రోజుల సమయం పట్టొచ్చు. బీటీపీఎస్‌లో ఒక యూనిట్‌లో సమస్య రావడంతో బొగ్గు లోడింగ్ బీటీపీఎస్‌కు తగ్గింది. సేల్ ఆర్డర్లు జీ–7 గ్రేడ్ కావాలని అడుగుతున్నారు. ప్రస్తుతం మణుగూరులో జీ–13 గ్రేడ్ కోల్ ఉంది. దీంతో లారీ యజమానులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తిరిగి బొగ్గు రవాణాకు కృషి చేస్తాం.

– దుర్గం రాంచందర్, మణుగూరు ఏరియా జీఎం

లోడింగ్ ఇచ్చి ఆదుకోవాలి



సింగరేణి నుంచి మణుగూరు నుంచి ఇతర ప్రాంతాలకు లారీల ద్వారా బొగ్గు రవాణా చేసి లారీ యజమానులను, ఆధారిత కుటుంబాలను ఆదుకోవాలి. సింగరేణి అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి ఆర్థికంగా కుంగుబాటుకు గురవుతున్న ఓనర్లను దృష్టిలో పెట్టుకుని లోడింగ్ పెంచాలి. రోజుకు 2వేల టన్నులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మేరెడ్డి సురేందర్‌రెడ్డి, లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం


కరకగూడెం: క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మధు

కరకగూడెం: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కారం మధు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన గురువారం క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న వంద రోజుల కార్యక్రమం 'నిక్షయ్ షివిర్'లో భాగంగా మండలంలోని బంగారుగూడెం గ్రామంలో క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, అనుమానితుల గుర్తించారు. శాంపిల్స్ స్వీకరించారు. క్షయ లక్షణాలు వివరించి, అలాంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి వ్యాధిగ్రస్తుడికి వ్యాధి తగ్గేవరకు నిరంతర సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పోషకాహారం నిమిత్తం మందులు వాడే కాలానికి ప్రతి నెలా రూ.1000 తమ ఖాతాలో జమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఐఓ కృష్ణయ్య, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి రైల్వేలైన్లు కీలకం

చంద్రుగొండ: గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రైల్వే లైన్లు కీలకమని కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ కోదమసింహం పాండురంగాచార్యులు అన్నారు. గురువారం చంద్రుగొండకు వచ్చిన ఆయనకు అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం–కొండపల్లి (విజయవాడ) రైల్వేలైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ లైన్ నిర్మాణంతో వందలాది గిరిజన గ్రామాల ప్రజలకు లాభం చేకూరుందన్నారు. కొవ్వూరు రైల్వేలైన్ పనులను త్వరితగతిన చేపట్టాలని ఆయన కోరారు. విజయవాడ రైల్వేలైన్ మంజూరికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ వంతు కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తేనే రైల్వేలైన్‌ల నిర్మాణాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటటరెడ్డి, మాజీ ఎంపీటీసీ దార వెంకటేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు నల్లమోతు రఘుపతిరావు, ఎన్డీ జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్, తుమ్మలపల్లి సురేష్, భోగి కృష్ణ, కుక్కడపు హరిబాబు పాల్గొన్నారు.

సభ పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరుటౌన్: రేపు కొత్తగూడెంలో జరగనున్న రెండు ఇఫ్టూల విలీన సభను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా నాయకుడు మిడిదొడ్ల నాగేశ్వర రావు కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. గురువారం మణుగూరులోని పలు కాంట్రాక్ట్ కార్మికుల అడడాలలో సింగరేణి రైల్వే, ఏరియా స్టోర్స్, కోల్ ట్రాన్స్‌పోర్ట్, రోడ్లు క్లీనింగ్ డిపార్ట్‌మెంట్లలో ఇఫ్టూ కొత్తగూడెం విలీన సభ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు.

దేశ వ్యాప్తంగా కార్మిక వర్గంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హక్కుల హననం, పనిగంటల పెంపు, కార్మిక చట్టాల మార్పు తదితర సమస్యలపై మాట్లాడారు. ఐక్యత అవసరాన్ని గుర్తించి రెండు ఇఫ్టూలు ఒక్కటిగా కార్మిక వర్గానికి అండదండలందించబోతున్నాయని, మరింత ప్రగతి శీల పోరాటాలకు సిద్ధం కాబోతున్నాయని తెలిపారు. 18న శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించే భారీ ప్రదర్శనకు వివిధ రంవగాల కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు అంగోత్ మంగీలాల్, జిల్లా నాయకులు నల్లా రమేశ్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు యు.శివరామకృష్ణ, సాంబ గురుమూర్తి, గోపి, వెంకటేశ్వర్లు, శ్రీను, భాస్కర్, ఈశ్వర్, సీతారాములు, ప్రవీణ్, యూసఫ్, వెంకటేశ్వర్లు, రాము, విజయ్, చిట్టిబాబు, ఉపేందర్, వేణు, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

పాలకమండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులతో ఎమ్మెల్యే

మణుగూరుటౌన్: పాత మణుగూరులోని నీలకంఠేశ్వరాలయ స్వామి దేవస్థానం పాలక మండలి గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈఓ సుదర్శన్, డివిజన్ ఇన్‌స్పెక్టర్ బేర్‌సింగ్ ఆధ్వర్యాన చైర్మన్‌గా కూచిపూడి వెంకటేశ్వర్లు బాబు, సభ్యులుగా గోపయ్య, సత్యనారాయణ, రవి, శ్యామల, పద్మ, నాగమణి ప్రమాణం స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని పాలకమండలి బాధ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అర్చకులు రామచంద్రమూర్తి, నాయకులు పీరినాకి నవీన్, తరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొనగా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్యతో పాటు ముత్తినేని వాసు, పుచ్చకాయల శంకర్, రఘు, కరివేదుల వెంకటేశ్వరరావు, రాము, పెంట్యాల వెంకటేష్, సతీష్, లోకేష్, సుధాకర్, ఉడుతనేని శ్రీను, జానీ పాలక మండలి చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ కోత

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం, మల్కారం గ్రామాల పరిధిలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏడీఈ వెంకటరత్నం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దమ్మపేటలో 33 కేవీ ఫీడర్ మరమ్మతులను శుక్రవారం నిర్వహించనున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో మృతి

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన టీఎస్ఎండీసీ ఉద్యోగి కుంజా శ్రీనివాసరావు(43) గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన చర్ల మండలంలో పనిచేస్తుండగా గురువారం ఉదయం విధులకు వెళ్తుండగా భద్రాచలంలో గుండె నొప్పితో కుప్పకూలాడు. ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. కాగా, శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారం క్రితమే ఆయన తన కుమార్తె ఓణీల వేడుక నిర్వహించగా ఇంతలోనే మృతి చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, పాడియం నరేందర్, ముత్యాలమ్మ తదితరులు సంతాపం తెలిపారు.

సొంత ఊరిలో వైద్యసేవలు


వైద్య శిబిరంలో గ్రామస్తులకు దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ హేమ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వేదాంతపురం గ్రామంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన డాక్టర్ కోడూరి హేమ.. సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన వేదాంతపురం వచ్చింది. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఉచితంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు దంత పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. స్థానికురాలైన వైద్యురాలు ఉచితంగా వైద్య సేవలు అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.

వాలీబాల్ టోర్నీ విజయవంతం

దుమ్ముగూడెం: మండలంలోని అచ్చితాపురం గ్రామంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించిన సాయం నవీన్ కుమార్ మెమోరియల్ రెండు మండలాల స్థాయి వాలీబాల్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో చర్ల, దుమ్ముగూడెం మండలాలు పోటీలలను నిర్వహించాయి. మూడు రోజుల పాటు జరిగిన వాలీబాల్ పోటీలలో ఫైనల్ పోటీలో కొత్త మారేడుబాక జట్టు బండిరేవు జట్టుపై గెలుపొందింది. విజేతలకు మొదటి బహుమతి రూ.15116,ద్వితీయ బహుమతి రూ.7516లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామారాజు, గట్టుపల్లి పూర్ణ చందర్ రావు, సోయం బాలకృష్ణ, ముక్తి జనార్దన్, మల్లికార్జున్, గ్రామ మాజీ సర్పంచ్ తెల్లం కృష్ణవేణి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రిటైర్డు ఉద్యోగి, మాజి సర్పంచ్ గట్టుపల్లీ నాగేశ్వర్ రావు, బుటారి నాగమణి, సోయాం పెంటయ్య, మిచ్చ దుర్గారావు, తెల్లం దర్మయ్య, గట్టుపల్లి రాం ప్రసాద్, శేషగిరి, సోయం నరసింహారావు, భద్రం, సంతోష్, శివాజీ, దినేష్, శ్యామ్ సుందర్, కుంజా రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


బూర్గంపాడు: పోటీలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అశ్వాపురం: క్రీడలతో మానసిక, శారీరక ఉల్లాసం సొంతమవుతుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని కట్టంవారిగూడెంలో గ్రామ యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న అల్లూరి సీతారామరాజు క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా మొదటి రెండు స్థానాల్లో నిలిచిన కట్టంవారిగూడెం, మిట్టగూడెం జట్లకు రూ.18వేలు, రూ.12వేల చొప్పున నగదు, ట్రోఫీలను ఎమ్మెల్యే, సీఐ అశోక్‌రెడ్డి అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్యతో పాటు షర్ఫియుద్దీన్, ఏనిక రవి, లక్ష్మీనారాయణ, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, సత్యనారాయణరెడ్డి, వీరభద్రం, భద్రారెడ్డి, గొల్లపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యకర సమాజం

బూర్గంపాడు: క్రీడలతోనే ఆరోగ్యకర సమాజం సాధ్యమవుతుందని, ముఖ్యంగా యువత ఫిట్‌గా ఉంటే దేశం ఫిట్‌గా ఉంటుందని భద్రాద్రి యువసేన వాలంటరీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు భూక్యా వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ యువజన దినోత్సవాల్లో భాగంగా ఫిజికల్ ఫిట్‌నెస్ డేను గురువారం అంజనాపురంలో నిర్వహించారు. అంజనాపురం, వేపలగడ్డ, పినపాక పట్టీనగర్ గ్రామాలకు చెందిన యువకులు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బానోత్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన యూసుఫ్ క్రికెట్ టోర్నీ

బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ 17వ క్రికెట్ టోర్నమెంట్ సెమీస్‌కు చేరింది. గురువారం జరిగిన నాలుగు క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. శుక్రవారం నాడు రెండు సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు నిర్వహక కమిటీ ప్రతినిధులు తెలిపారు. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులను అందజేశారు.

ప్రయాణికులతో కిటకిట


ప్రయాణికులతో రద్దీగా మారిన భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ బస్ స్టేషన్ గురువారం ప్రయాణికులతో రద్దీగా మారింది. సంక్రాంతి పండుగను తమ కుటుంబ సభ్యులతో జరుపుకుని తిరుగు ప్రయాణంలో భద్రాచలం నుంచి ఇతర ప్రాంతాలకు తిరుగుపయనం అవుతున్నారు. ప్రధానంగా భద్రాచలం–ఖమ్మంతోపాటు భద్రాచలం–హైదరాబాద్ మార్గంలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతుండగా, ప్రయాణికుల రద్దీ దృష్టిలో ఉంచుకుని బస్సు సర్వీసులు నడుపుతున్నని భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి తెలిపారు.

లబ్ధిదారుల ఎంపికకు సర్వే షురూ


ములకలపల్లి: సంద్రకుంట గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


బూర్గంపాడు: పినపాక పట్టీనగర్‌లో సర్వే చేస్తున్న తహసీల్దార్ ముజాహిద్


దుమ్ముగూడెం: ఫీల్డ్ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ అశోక్‌కుమార్

బూర్గంపాడు: తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు ప్రభుత్వ పథకాల లబ్దిదారులను ఎంపిక చేసేందుకు గురువారం క్షేత్రస్థాయిలో సర్వే ప్రారంభించింది. రైతు భరోసా పథకాన్ని అందించేందుకు సాగు యోగ్యత ఉన్న భూముల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో గుర్తిస్తున్నారు. రేషన్‌కార్డులను అందించేందుకు కులగణన సర్వే ఆధారంగా రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేపట్టారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం పంచాయతీ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేలను చేపట్టారు.

ములకలపల్లి: నాలుగు ప్రభుత్వ పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం చేస్తున్న సర్వేను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పరిశీలించారు. మండలపరిధిలోని సంద్రకుంట గ్రామంలో గురువారం చేపడుతున్న సర్వేను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్‌కార్డు నిమిత్తం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. సర్వే తీరును ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా పకడ్బందీగా సర్వే చేపట్టాలన్నారు. జీపీ కార్యదర్శి ఇబ్రహీం, సర్వే బృందం ఉన్నారు.

దుమ్ముగూడెం: మండలంలో ప్రభుత్వం అందచేసే సంక్షేమపథకాలను అందుకునే లబ్దిదారుల ఎంపిక కోసం చేపట్టిన సర్వేను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ సూచించారు. గురువారం నుంచి ప్రారంభమైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం అర్హుల ఎంపిక సర్వేను ఆయన బండారుగూడెం గ్రామంలో పరిశీలించారు. సర్వేలో మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ, ఆర్‌ఐలు వెంకటేశ్వరరావు, నరసింహారావు ఏఈఓలు హసీనా, ప్రవీణ్, బాలాజీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ప్రభుత్వం కొత్తగా అమలు చేయనున్న నాలుగు పథకాల సర్వే పగడ్బందీగా పూర్తి చేయాలని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ గ్రామ స్థాయి అధికారులకు సూచించారు. గ్రామసభల నిర్వహణపై స్థానిక రైతువేదికలో గురువారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ సంధ్యారాణి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఏఓ వినయ్, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం సాగు భూముల సర్వేను పకడ్బందీగా చేయాలని స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఏవో శివరాం ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని అచ్యుతాపురం, ఆసుపాక గ్రామాల్లో సాగు భూముల సర్వేను ప్రారంభించి, పరిశీలించారు. ఆర్‌ఐలు కృష్ణ, పద్మావతి, ఏఈవోలు రవీందర్, సతీష్ పాల్గొన్నారు.

దమ్మపేట: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల ఇంటి వద్దకే వెళ్లిన గ్రామపంచాయతీ కార్యదర్శులు, గురువారం సర్వే ప్రక్రియ చేపట్టారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని 31 గ్రామ పంచాయతీల్లో ఈ సర్వేను ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కుటుంబ సర్వేలోని వివరాల మేరకు లబ్దిదారుల జాబితా ఇప్పటికే కార్యదర్శులకు అందగా.. సర్వేలో వారి ఇంటికి వెళ్లి, వివరాలను సరిచూశారు. ఇప్పటివరకు నమోదు అయిన వివరాలలో తప్పులుంటే, వాటిని సరి చేశారు. త్వరలో నిర్వహించనున్న గ్రామ సభల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను మరింత పారదర్శకంగా చేపట్టనున్నారు.